క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవనిగడ్డ: నాగాయలంక రోడ్డులోని కొత్త సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య విద్యుత్ కోత ఉంటుందని ఏఈ వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై వాలిన చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. అవనిగడ్డలోని 2,4,5,7,8,9 వార్డులతో పాటు ఎడ్లంక, హౌసింగ్ కాలనీ, బందలాయిచెరువు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గృహాలు, వాణిజ్య వ్యాపారాలు, ఆక్వా చెరువులకు కరెంట్ కోత ఉంటుందని వివరించారు.

ముత్యాలమ్మ గుడి అభివృద్ధికి విరాళం



ఘంటసాల: భక్తుల కోర్కెలు తీర్చే తల్లి కోట ముత్యాలమ్మ దేవస్థానం అభివృద్ధికి దాతలు ఆదివారం విరాళం అందించారు. ఘంటసాల – దేవర కోట గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ కోట ముత్యాలమ్మ దేవస్థానం అభివృద్ధికి ఘంటసాల గ్రామానికి చెందిన తుమ్మలచర్ల దివ్య తండ్రి పానకాల రాయుడు రూ.13,100 విరాళాన్ని ట్రస్టీ వేమూరి ప్రవీణ్‌కు అందించారు. కార్యక్రమంలో ముల్పూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



చల్లపల్లి: నిమ్మల తోటలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భానూ నంబూద్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

భక్తజన కోలాహలం



మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తజనంతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డిమాండ్లకు అనుగుణంగా పంటల సాగు



కొడాలి(ఘంటసాల): మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా రైతులు పంటలు పండించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం కొడాలిలో కేవీకే ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియమాన్ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయంలో సాగు వ్యయం తగ్గించేందుకు ప్రభుత్వం యాంత్రీకరణ ప్రోత్సహిస్తోందని, రైతులకు 50 శాతం రాయితీ పై యంత్ర పరికరాలు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడూరులో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



గూడూరు: గూడూరులోని పాలకేంద్రం సెంటరులో పునఃనిర్మించిన శ్రీ సీతా రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ సోమవారం చేయడానికి చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. శిథిలావస్థకు చేరిన ఆలయ స్థానంలో రూ.25 లక్షల వ్యయంతో కొత్తగా ఆలయ నిర్మాణం చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సర్వర్ మొరాయింపు.. రేషన్ కష్టాలు

- రేషన్ ప్రారంభం రోజే ఇబ్బందులు
- మంత్రి ప్రారంభించిన దుకాణంలోనూ సర్వర్ తిప్పలు
- సమయపాలన పాటించని రేషన్ డీలర్లు
- పడిగాపులు పడిన ప్రజలు
- గత ఐదేళ్ల ఇంటింటి సరుకుల పంపిణీనే బాగుందంటున్న వినియోగదారులు



బందరు బుట్టాయిపేట 48వ నంబర్ దుకాణం తెరవక పడిగాపులు పడుతున్న వినియోగదారులు



బంటుమిల్లి నాగేశ్వరరావుపేట రేషన్ దుకాణం వద్ద సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

మచిలీపట్నంటౌన్: రేషన్ దుకాణాల పునఃప్రారంభం రోజే నగర వినియోగదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. బందరులోని రాజుపేట చెక్కల మేడ సెంటర్లోని దుకాణం వద్ద సరుకుల పంపిణీని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీలతో కలసి ప్రారంభించారు. అయితే ఆ దుకాణంలో సైతం సర్వర్ ఇబ్బందులు తలెత్తటంతో వినియోగదారులు విసుగు చెందారు. ఇలా నగరంలోని పలు రేషన్ దుకాణాల్లో సర్వర్ సమస్యతో వినియోగదారుల బయోమెట్రిక్ పడక గంటల సేపు ఇబ్బంది ఎదురైంది. బందరులో రేషన్ దుకాణాలు 128 ఉండగా, వీటి ద్వారా 69 వేల కార్డుదారులు సరుకులు తీసుకుంటున్నారు.

ఇన్నాళ్లు ఇంటి ముందుకే వచ్చిన ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు తీసుకోవడానికి అలవాటు పడిన ప్రజలు ఆదివారం రేషన్ దుకాణాలకు వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు షురూ అయ్యాయి.

గత ఐదేళ్లూ ఇబ్బంది లేకుండా

గత ఐదేళ్ల పాటు ప్రతి నెలా 1నుంచి 17వ తేదీ వరకూ ఎండీయూ వాహనాల్లో ఇంటింటికీ సరుకుల పంపిణీ జరిగింది. సరుకులు తీసుకోని వారి కోసం ఓ రోజు సచివాలయం వద్ద కూడా వాహనం ద్వారా సరుకులు పంపిణీ చేశారు. కానీ ప్రస్తుతం దుకాణాల ద్వారా 15వ తేదీ వరకే సరుకుల పంపిణీ జరుగుతుందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన సమయ పాలనను నగరంలోని పలు రేషన్ దుకాణాల నిర్వాహకులు పాటించకపోవటంతో ప్రారంభం రోజే వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. నగరంలోని బుట్టాయిపేటలోని 48వ నంబర్ దుకాణం మధ్యాహ్నం 5 గంటల తర్వాత తెరవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

రేషన్ అందక ఇక్కట్లు

పెడన: నియోజకవర్గంలో పలు చోట్ల సర్వర్లు మొరాయించడంతో రేషన్ అందక పడిగాపులు పడ్డారు. ఉదయమే 8 గంటలకు అని చెప్పడంతో పలువురు రేషన్ షాపులకు వెళ్లి సర్వరు అందక తిరిగి వెళ్లిపోయారు. మరికొందరు సర్వరు దొరుకుతుందేమోనని దుకాణాలు వద్దే వేచి ఉన్నారు. పెడన నియోజకవర్గంలోని పలు దుకాణాలు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో రేషన్ పంపిణీని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు.

● అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని రేషన్ పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వచ్చి ఇవ్వడమే బాగుంది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనంలో మా ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చారు. ప్రతి నెలా ఇబ్బంది లేకుండా సరుకులు తీసుకున్నాం. ఇలాంటి మంచి పద్ధతిని కూటమి ప్రభుత్వం ఎందుకు మార్చిందో అర్థం కావడం లేదు.

–చక్కా మల్లేశ్వరి, పాతరామన్నపేట

పాత పద్ధతే అమలు చేయాలి



రేషన్‌సరుకులను పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలి. దూరాన ఉన్న రేషన్ దుకాణానికి నా లాంటి ముసలివాళ్లం ఎండలో వచ్చి సరుకులు తీసుకెళ్లాలంటే ఇబ్బంది కలుగుతోంది. డీలర్ సమయానికి దుకాణం తీయలేదు. ఈ పూట తీయకుంటే మళ్లీ వచ్చి తీసుకోవాలంటే మరింత సమస్య.

– బొడ్డు లక్ష్మమ్మ, బుట్టాయిపేట

వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు అలవాటు

- ఈ నెల 4న 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, నాయకులు

అవనిగడ్డ: సీఎం చంద్రబాబుకు వెన్నుపోటు రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్యని, మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచినప్పటి నుంచి అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం వెన్నుపోటు దినం నిరసన పోస్టర్లను సింహాద్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఏడాదైనా అమలు చేయలేదన్నారు. రైతు భరోసా ఊసేలేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సింహాద్రి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బస్తా ధాన్యం రూ.2,200 కొంటే ఇప్పుడు రూ.1,600 కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఉచితబస్సు, నిరుద్యోగ భృతి, వలంటీర్లకు పదివేలు ఇలా చెప్పుకుంటూ పోతే ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేసి వెన్నుపోటు పొడిచారన్నారు.

జనసేన నేతలకు బుద్ధప్రసాద్ వెన్నుపోటు

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెన్నుపోటు రాజకీయాల్లో నంబర్‌వన్ అని సింహాద్రి రమేష్‌బాబు ఎద్దేవా చేశారు. గతంలో అంబటి బ్రాహ్మణయ్య కుమారుడు అంబటి శ్రీహరిప్రసాద్‌కు సీటు రాకుండా వెన్నుపోటు రాజకీయం చేశారని, చివరికి బ్రాహ్మణయ్య ఫొటోకూడా పెట్టకుండా అడ్డుకున్నారన్నారు. ఆరు శాతం ఓట్లున్న పార్టీ, పిల్లల పార్టీ అని జనసేనను విమర్శించిన బుద్ధప్రసాద్ ఆ పార్టీ నాయకులను వెన్నుపోటు పొడిచి ఎమ్మెల్యే అయ్యారని చెప్పారు.

విజయవంతం చేయాలి

కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై ఈనెల 4వ తేదీన చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు పిలుపునిచ్చారు. నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జయగోపాల్, సాంస్కృతిక విభాగం నియోజకవర్గ కన్వీనర్ యాసం శివ, సీనియర్ నాయకులు మధు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: వెన్నుపోటు దినం కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొనాలని వైఎస్సార్ సీపీ నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహననాంచారయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 4వ తేదీన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం నార్త్ మండల పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాంచారయ్య మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండల ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల నాగబాబు, మండల ఉపాధ్యక్షుడు మందా బాబురావు, జిల్లా జాయింట్ సెక్రటరీ జువ్వా నాగరాజు, మండల కార్యదర్శి వన్నెంరెడ్డి రామకృష్ణ, కానూరు గ్రామ ఉపసర్పంచ్ గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నార్త్ మండల పార్టీ నేతలు

కోడూరులో

కోడూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'వెన్నుపోటు దినం' నిరసనను విజయవంతం చేయాలని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్ సీపీ అభిమాని ముక్కోలు రాముడును రమేష్‌బాబు పరామర్శించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ కోడూరు, అవనిగడ్డ కన్వీనర్లు పరిశె మాధవరావు, రేపల్లె శ్రీనివాసరావు, రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణ రావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కూటమి



వెన్నుపోటు దినం నిరసన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప్పాల రాము, వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెడన: ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోయిన ఎన్డీయే కూటమి సర్కారులోని చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన విధానాన్ని గుర్తుచేసేలా జూన్ 4న వెన్నుపోటు దినంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారని ఆ పార్టీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆదివారం పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జూన్ 4న వెన్నుపోటు దినం గోడపత్రికను ఆవిష్కరించారు. ఉప్పాల రాము మాట్లాడుతూ రైతులను, విద్యార్థులను, పేద, బడుగు బలహీనవర్గాలను మోసం చేయడమే కాకుండా పథకాలను ఇదిగో అదిగో అని చెబుతూ కాలయాపన చేస్తున్న ఎన్డీయే కూటమి సర్కారుపై నిరసన తెలియజేయాల్సిన సమయం వచ్చిందన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెడనలో జూన్ 4న జరిగే నిరసన కార్యక్రమానికి పెడన పట్టణం, మండలంతో పాటు బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాలకు చెందిన ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలి రావాల్సిందిగా కోరారు. ఆ రోజు ఉదయం పది గంటలకు పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని నిరసన ప్రదర్శన నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జల్లా భూపతిరాజు, ముత్యాల నాగేశ్వరరావు, దావు భైరవలింగం, సమ్మెట జయవర్ధన్, కర్ణాశ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, ఫ్లోర్ లీడర్ భళ్ల గంగయ్య, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన అమలేశ్వరి జాతర

- చివరి రోజు తరలివచ్చిన భక్తులు
- గంటల కొద్దీ నిలిచిపోయిన వాహనాలు



అమలేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము

పెడన: దావోజీపాలెంలోని శ్రీవిజయ అమలేశ్వరి దేవి జాతర మహోత్సవాలు 11 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. అంకెం వారి ఇలవేల్పు అయిన ఈ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఆదివారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి అధికమైంది. సాయంత్రానికి భక్తుల తాకిడి అధికమవడంతో ఆ రోడ్డు చక్రబంధంలో చిక్కుకుంది. వైఎస్సార్ సీపీ పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఉప్పాల రాము, పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అమ్మవారిని దర్శించుకున్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య)లు సైతం అమ్మవారిని దర్శించుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండదని అంచనా వేసిన అధికారులు తక్కువ మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేసి విఫలమయ్యారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ సత్యనారాయణలతో పాటు మరో నలుగురు కానిస్టేబుల్స్ ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం నుంచి ట్రాఫిక్ సమస్య లేకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. ముందునుంచే తీసుకుంటే బాగుండేదనే వాదన భక్తుల నుంచి వ్యక్తమైంది.

250 మందికి వైద్య సేవలు

మచిలీపట్నంటౌన్: నగరంలో బుట్టాయిపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూటీఎఫ్ మాజీ నేత పెనుబోతు వెంకటేశ్వరరావు స్మారక వైద్య శిబిరంలో వైద్యులు రామశాస్త్రులు, సతీష్ చంద్రారెడ్డి, వరప్రసాద్, ఇతర సాంకేతిక సిబ్బంది పాల్గొని 250 మంది రోగులను పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను రూ. 200కే అందజేశారు. శిబిర నిర్వహణ కమిటీ కన్వీనర్ పామర్తి నాగయ్య, ఇతర సభ్యులు పర్యవేక్షించారు. తిరిగి ఈ వైద్య శిబిరం ఆగస్టు 3వ తేదీ ఆదివారం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డుపైకి రావాలంటే భయం.. భయం

- ఆవు పొడవడంతో చెయ్యి విరిగింది
- పెడన ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న రెండో వార్డు ప్రజలు



విరిగిన చేతితో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు మొరపెట్టుకుంటున్న బాధితురాలు

పెడన: 'నాలుగు రోజుల క్రితం రోడ్డుపై నడుస్తున్న సమయంలో ఆవు ఒకటి వచ్చి పొడిచింది. రోడ్డుపై పడిపోవడంతో ఎడమ చేయి విరిగింది. ప్రాణం పోతే పరిస్థితి ఏమిటి.. ఈ సమస్యను పరిష్కరించండి' అంటూ రెండో వార్డు ప్రజలు పెడన ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఆదివారం రేషన్‌షాపు ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు స్థానికులు ఆవుల బెడదను వివరించారు. నిత్యం సాయంత్రం, రాత్రి సమయంలో సంచరిస్తూ భయపెడుతున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎమ్మెల్యే స్పందించి కమిషనర్ గోపాలరావును పిలిచి ఆవులు రోడ్లపై తిరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత యాజమానులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

విశ్రాంత ఆర్టీవో రావి దుర్గా చౌదరి మృతి

మోపిదేవి: ఆర్టీవోగా పనిచేసి రిటైరైన రావి దుర్గా చౌదరి(76) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా మోపిదేవిలో వారి ఇంటివద్ద అనారోగ్యంతో బాధపడుతున్నారు. చౌదరి మరణవార్త తెలియడంతో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మోపిదేవిలోని వారి ఇంటికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని తండ్రి రావి పెదబాబూరావు గ్రామ మాజీ సర్పంచ్. మృతునికి భార్య సీతా రత్నకుమారి, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, కంఠంనేని పెదబాబు, విశ్రాంతి రవాణా శాఖ అధికారులు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదు

బందరు ఆర్డీఓ స్వాతి



బందరులో జరిగిన ర్యాలీలో ఆర్డీఓ స్వాతి, అధికారులు

మచిలీపట్నంటౌన్: మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదని మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి స్వాతి ప్రజలకు పిలుపునిచ్చారు. బందరులో జెడ్పీ కార్యాలయం నుంచి లక్ష్మీ టాకీస్ వరకు ఆదివారం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నషాముక్త భారత్ అభియాన్ పేరుతో బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని మాదకద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు నషాముక్త భారత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, గంజాయి, మారిజువాన వంటివి మాదకద్రవ్యాలన్నారు. యువత ఎక్కువగా ఉన్న దేశాల్లో భారత దేశం ఒకటని, దేశంలో యువత 25 శాతం ఉందన్నారు. మాదకద్రవ్యాలతో చాలా అనర్థాలు కలుగుతాయని ప్రజలకు వివరిస్తూ వాకథాన్, మారథాన్ అవగాహన ర్యాలీలు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తారన్నారు. ఇందులో ప్రజలను కూడా భాగస్వాములను చేస్తున్నామన్నారు. బందరు డీఎస్పీ సీహెచ్ రాజా మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలు గతంలో మత్తు పదార్థాలకు బానిసైన వారితో కలిసి ర్యాలీ నిర్వహించామన్నారు. మచిలీపట్నంలో కొంతమంది అక్కడక్కడ గంజాయి అమ్ముతున్నారన్నారు. కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కామరాజు, డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి, చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీ, దివ్య యోగ మందిర్, ఏపీ యోగ సభ గురువులు గురునాథబాబు, చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

పండిత సభలు ప్రారంభం



పండిత సభలో స్వామీజీలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసి ఉన్న శ్రీ దేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం (యతి రాజ భవనం)లో ఆదివారం ఉభయ వేదాంత పండిత సభలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి పాల్గొని భాగవత విశిష్టత, వైభవంపై భక్తులకు అభిభాషణ చేశారు. ఆయన మాట్లాడుతూ మీకు ఉన్న యతిరాజ భవన స్థలంలో యతిరాజ సభా భవనం పేరున భవన నిర్మాణం చేపట్టాలని, వచ్చే సంవత్సరం జరిగే సభలు ఆ భవనంలో వేంకటేశ్వరుని దయతో జరుపుకునే ఆలోచనతో పురోగమించాలని మంగళశాసనం చేశారు. అనంతరం వెంకటాచార్యస్వామి అధ్యక్షత వహించి ద్వయ మంత్రం, లక్ష్మీ వైభవాన్ని భక్తులకు వివరించారు. ఎంటీ ఆళ్వార్ స్వామి యతిరాజ వింశతి గురించి సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. రఘునాథ్ బట్టర్ స్వామి, పరాశర రామానుజ బట్టర్ స్వాములు కూడా సందేశాలు ఇచ్చారు. గుదిమెళ్ళ శ్రీకర్ రామానుజ స్వామి పండిత సభల వైశిష్ట్యంపై ప్రారంభ ఉపన్యాసం చేశారు. యతిరాజ భవన కార్యదర్శి దోరడ్ల హేమ ప్రకాష్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జీయర్ స్వామితో పాటు ఇతర స్వాములకు పూల మాలలతో ఘన స్వాగతం పలికారు.

విగ్రహ ప్రతిష్ఠకు ముస్తాబు





జరుగువానిపాలెంలో విద్యుత్ దీపకాంతులతో కళకళలాడుతున్నఆంజనేయుడి ఆలయం

కోడూరు: మండలంలోని జరుగువానిపాలెం గ్రామంలో నిర్మించిన పంచముఖ ఆంజనేయుడి ఆలయంలో స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం 8.09 గంటలకు పంచముఖ ఆంజనేయుడితో పాటు గణపతి, దక్షిణమూర్తి స్వామివారి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతిష్ఠామూర్తికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను భక్తిప్రపత్తులతో చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం సోమవారం మహాఅన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

బంటుమిల్లి: ఆముదాలపల్లిలోని గంగ, పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు అమ్మవారికి కుంకుమార్చన పండితులు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్యబృందం వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న రుద్ర, దుర్గసూక్త హోమానికి పూర్ణాహుతి చేశారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు.